క్లుప్తంగా

వెంకయ్య సేవలు మరువలేనివి



వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: మడకం వెంకయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. మడకం వెంకయ్య వర్ధంతి సభను మంగళవారం చింతూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్‌గా, ఎంపీపీగా, డివిజన్ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. నాయకులు సురేష్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాజయ్య, రమేష్, గోవింద్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మొర్రిగుడలో రచ్చబండ ప్రారంభం



మొర్రిగుడలో రచ్చబండను ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో సర్పంచ్ పాంగి సునీత ఆధ్వర్యంలో మంగళవారం రచ్చబండ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధులు సుమారు రూ.2లక్షలతో రచ్చబండ(ప్రజావేదిక) నిర్మించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ సమస్యలు చర్చించేందుకు వినియోగించాలని ఆమె కోరారు.పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, వార్డు సభ్యులు సత్యనారాయణ, రాజ్‌కుమార్, గోపాల్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎంఈవో త్రినాథరావు

డుంబ్రిగుడ: అరకులోయ మండలంలోని ఎండపల్లివలస కేజీబీవీలో మంగళవారం ఎంఈవో వంతాల త్రినాథరావు విద్యార్థులకు ఒకేషనల్ విద్య సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ విద్య ద్వారా విద్యార్థులు ఆయా రంగాల్లో స్థిరపడేందుకు దోహద పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఝాన్సీరాణి, ఉపాధ్యాయురాలు ప్రమీలరాణి, లత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల ప్రారంభం



నీటితొట్టె ప్రారంభిస్తున్న నాయకులు

ఎటపాక: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి తొట్టెని మంగళవారం ప్రారంభించారు. గన్నవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా తొట్టెలను నిర్మించారు. సర్పంచ్ భద్రమ్మ నీటి తొట్టెను ప్రారంభించారు. ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, ఉపాధి సిబ్బంది పద్మ, సీతారామ, సచివాలయం సిబ్బంది రామ్‌ప్రసాద్, సత్యనారాయణ, నరేష్, ముత్తయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

దోమల నిర్మూలనకు సహకరించాలి



దోమలమందు పిచికారీను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: పసరిగిన్ని గ్రామంలో మంగళవారం నిర్వహించిన దోమలమందు పిచికారీను ఎంపీడీవో కె.బాపన్నదొర పరిశీలించారు. ప్రతీ ఇంట్లో లోపల, బయట నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లోను తప్పనిసరిగా దోమల మందును పిచికారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. దోమలమందు పిచికారీకు ప్రజలంతా సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సర్పంచ్ పల్లాల రాజేశ్వరి, మలేరియా టెక్నీషియన్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భార్గవరామ్‌చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం



డుంబ్రిగుడలో వడగళ్లు వాన



చింతపల్లిలో కురుస్తున్న వర్షం



వాకపల్లిలో ఈదురుగాలులకు దెబ్బతిన్న పెద్దమ్మి రేకుల ఇల్లు

డుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. డుంబ్రిగుడ మండల కేంద్రంలో వడగళ్ల వాన కురిసింది. స్థానిక మెయిన్‌రోడ్డులో దుకాణాల సముదాయం వద్ద వర్షపునీరు ముంచెత్తింది.

చింతపల్లి: చింతపల్లిలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్దిగంటలపాటు విద్యుత్తు సరఫరా నిలచిపోయింది.

జి.మాడుగుల: మండలంలోని జి.మాడుగుల–నుర్మతి, మద్దిగరువు రోడ్డు మార్గంలో ఎన్.కొత్తూరు గ్రామం వద్ద ఈదురుగాలులకు చెట్టు రోడ్డు అడ్డంగా నేలకూలింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వాకపల్లి గ్రామంలో తల్లే పెద్దమ్మి ఇంటి సిమ్మెంట్ రేకులు గాలికి ఎగిరిపోయాయి. ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులైయ్యారు. ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరారు. జి.మాడుగుల–పాడేరు, నుర్మతి, వంజరి, సొలభం, గడుతూరు రోడ్లు జలమయమ్యాయి.

గూడెంకొత్తవీధి: వర్షానికి లోతట్టుప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. విద్యుత్తు సరఫరా కొద్దిగంటలపాటు నిలచిపోయింది. దుప్పిలవాడ వద్ద పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. దేవరాపల్లి పంచాయతీ మంగలపాలెం వద్ద జియో టవర్ వద్ద కరెంటు షాక్‌కు గురై రెండు దుక్కిటెద్దులు మరణించాయి.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఈఈ వాసుదేవరావు

మోతుగూడెం: మోతుగూడెంలని డీఏవీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ జెన్‌కో కళాభారతి స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో సీఈ వాసుదేవరావు హాజరైయ్యారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు సీఈ, జెన్‌కో అధికారులు బహుమతులు అందజేశారు. ఎస్ఈ (ఓఎన్ఎం) చిన్న కామేశ్వరరావు, డీఈ బాలకృష్ణ, వరప్రసాద్, హెచ్ఎం రఘురాం, సర్పంచ్ ఆకేటి సీత ఎంపీటీసీ కరక రమణ పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మతల్లి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: చింతలవీధిలో మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.మోదమ్మను భక్తులు దర్శించుకుని మట్టి,ఇత్తడి ఘటాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఘటాల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నరసింగరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

డబ్బు కోసం పార్టీకి వెన్నుపోటు

ముంచంగిపుట్టు: డబ్బు కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచి మాటలు వద్దని టీడీపీ మండల అధ్యక్షుడు కిలో బలరాం అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతల ఆరాచకాలకు పాల్పడుతున్నట్టు తమ పార్టీ నాయకులు చేసిన ప్రకటనను ఖండించారు. మండలంలో టీడీపీలో వర్గపోరు కొనసాగుతున్న విషయం విదితమే. నేతలు జగన్నాయ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలకు అవమానం

చింతూరు: ఏజన్సీలోని ఉద్యోగాలను స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీచేస్తామని చెప్పిన ప్రభుత్వం జనరల్ అభ్యర్థులతో భర్తీచేయడం ద్వారా ఆదివాసీ చట్టాలను అవమానించిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగినా ప్రజా ప్రతినిధులు మాట్లాడకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా ఆదివాసీ సమాజం మేల్కొనకుంటే భవిష్యత్తులో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఆదివాసీ హక్కులు, చట్టాల సాధనకు ఆదివాసీ సంఘాలన్నీ కలిసి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కుక్కకాటుతో విద్యార్థికి గాయాలు



కుక్కదాడి చేయడంతో గాయాలపాలైన శివారెడ్డి

రాజవొమ్మంగి: స్థానిక కన్నయమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న జర్తా సాంబ శివారెడ్డిపై మంగళవారం కుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. శివారెడ్డి పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం కుళాయి వద్ద ప్లేటు కడుగుతుండగా అక్కడే పొంచి ఉనన కుక్క దాడి చేసి ఐదు చోట్ల గాయపరచింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు చికిత్స అందజేశారు.

కుక్కల స్వైరవిహారం

మండలకేంద్రం రాజవొమ్మంగిలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. కుక్కల దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులుగా తిరుగుతున్నాయని భయటకొచ్చేందుకు భయపడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ సీతయ్య

కొయ్యూరు: ఉపాధి కూలీలంతా విధిగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) చేయించుకోవాలని చింతపల్లి క్లస్టర్ ఏపీడీ ఎల్.సీతయ్య సూచించారు. ఆయన మంగళవారం వీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌తో నిర్వహించిన వీడియో సమావేశాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలు పీఎంఎస్‌బీవైకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని ప్రీమియంను లబ్ధిదారులు చెల్లించాలని సూచించారు. నిర్దేశించిన పని దినాలను వీఆర్‌పీలు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ఫారంపాండ్లను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై పోరాటం



కొత్తూరుపాడులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



రాజవొమ్మంగిలో ర్యాలీ చేస్తున్న కార్యకర్తలు

అడ్డతీగల: మండలంలోని కొత్తూరుపాడులో మంగళవారం సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నేతలతో పాటు దాని అనుబంధ గిరిజన సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భూమి కోసం, భుక్తి కోసం విరోచితమైన పోరాటాలతో ఎందరో నాయకుల ప్రాణత్యాగంతో ప్రజల పక్షాన నిలిచిన సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా పార్టీ అని పార్టీ జిల్లా కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ అన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ పతాకాన్ని ఎగరవేసి అమర వీరులకు జోహార్లు అర్పించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయని కూటమి ప్రభుత్వం

రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం, బూరుగపల్లి తదితర గ్రామాల్లో సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకొన్నారు. గిరిజన సంఘం కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం నేటికీ అమలుచేయలేదన్నారు. బూటకపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. నాయకులు కుశల, కళావతి, అచ్యుత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి



ఎంపీపీ రమేష్

కొయ్యూరు: గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత జీవో నెంబర్–3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు గిరిజన అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలన్నారు. జిల్లాల్లో 512 పోస్టులు ఉంటే వాటిలో గిరిజనులకు ఆరుశాతం పోస్టులు కేటాయించి మిగిలిన 94 శాతం ఇతరులకు కేటాయించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీని రద్దు చేసి గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలన్నారు.

మౌలిక వసతులు లేకుండా పునరావాసమా!



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చింతూరు: పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకుండా పోలవరం నిర్వాసితులను తరలించడం ఎంతవరకు సబబని కాంగ్రెస్ పార్టీ నిర్వాసితుల అధ్యయన కమిటీ అధ్యక్షుడు మార్టిన్‌లూథర్ ప్రశ్నించారు. పునరావాస కాలనీలు, ముంపు ప్రాంతాలను పర్యటించిన కమిటీ సభ్యులు మంగళవారం చింతూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మార్టిన్‌లూథర్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం గ్రామాలను వీడి సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకుండా ప్రభుత్వం నిర్వాసితులను బలవంతంగా తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దివంగత వైఎస్సార్ కలల ప్రాజెక్ట్ అయిన పోలవరం 45.72 మీటర్ల ఎత్తుకు నిర్మించాలని, కేంద్ర బడ్జెట్‌లో ప్రాజెక్టు ఎత్తును 41.15 వరకే పరిమితం చేస్తూ బిల్లులో పొందుపరిచినా కూటమి ప్రభుత్వ నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం, సీడబ్ల్యూసీ ఆమోదించిన డీపీఆర్ ప్రకారం పూర్తి ఎత్తు సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని ఆయన కోరారు. నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, బుల్లిబాబు, రామలక్ష్మి, హబీబ్, అహ్మద్‌అలీ, హనీఫ్, నరేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ సుభాష్‌చంద్ర, తల్లిదండ్రులు

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయుల బోధనతోనే ఉత్తమ ఫలితాలు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి ఎంపీపీ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థుల అర్హతకు శ్రమించిన టీచర్లు హరిష్‌చంద్ర, ఆనంతరావు, రమాప్రభలను సర్పంచ్ సుభాష్ చంద్రతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణ సాధన హర్షణీయం



మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గాంధీబాబు

వి.ఆర్.పురం: ఎస్సీ వర్గీకరణ మాదిగల విజయోత్సవ సభ వీఆర్‌పురం బీసీ కాలనీలో మాదిగ పోరట సమితి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.

ఈ సందర్భంగా మాదిగల రిజర్వేషన్ కోసం పోరాటం చేసి విజయం సాధించిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఏఎస్‌డీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు ఉండవల్లి గాంధీబాబు క్షీరాభిషేకం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల కోసం రిజర్వేషన్ సాధించిన మంద కృష్ణ మాదిగ దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. సాధించిన రిజర్వేషన్‌కు అనుగుణంగా మాదిగలు ఫలలాను అందుకోవాలన్నారు. విష్ణుమూర్తి, వెంకన్న, నరసింహారావు, శ్రీనివాసు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌సి కౌన్సిలర్ వాసు

అడ్డతీగల: వడదెబ్బపై అజాగ్రత్త తగదని స్థానిక సీహెచ్‌సీ కౌన్సిలర్ నారే వాసు అన్నారు.వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటూ వడదెబ్బకు గురైతే నివారణకు పాటించవలసిన అంశాలపై సీహెచ్‌సీలో మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వడదెబ్బ తగిలినప్పుడు వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ పండా సతీష్ చెప్పారు. వడదెబ్బ తగిలితే జ్వరం రావడం, తలతిరగడం, గుండె ఎక్కువగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది, వాంతులు, యూరిన్ పసుపు రంగులోనికి మారడం వంటివి జరుగుతాయన్నారు. 108 కి గాని లేదా 104 హెల్ప్ సెంటర్‌కి కాల్ చేయాలని లేకుంటే ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.

అధికారుల తీరుపై ధ్వజం

డుంబ్రిగుడ: మండలంలోని సంపంగి గెడ్డ వద్ద వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మలను అధికారికంగా ఆహ్వానించకపోవడంపై అధికారులు ప్రదర్శించిన తీరుపై మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాంగి పరశురాం, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూటమి నాయకులకు అధికారులు వత్తాసు పలుకుతూ ప్రొటోకాల్ ఉల్లంఘించడం దారుణమని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ద్వారా గెలిచిన ప్రజాప్రతినిధుల పట్ల ప్రొటోకాల్ పాటించని అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల తీరు మార్చుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని వివిధ ప్రాంతాలకు రహదారులు, వంతెనల నిర్మాణానికి నిధులు సమకూర్చి అభివృద్ధికి దోహదపడిన ప్రజాప్రతినిధుల పట్ల ప్రస్తుత అధికారుల ప్రదర్శిస్తున్న తీరుపై పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఆత్మీయ సన్మానం



హెచ్ఎం మత్స్యరాజును సన్మానిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు



మోహనాపురం పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో బూరుగువీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం మత్స్యరాస మత్స్యరాజును మంగళవారం ఉపాధ్యాయుడు డుంబేరి కృష్ణమూర్తి విద్యార్థులు , వారి తల్లిదండ్రులు శాలువ కప్పి బొకేలు అందించి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు కోడా సందీప్, గొల్లోరి మాధవి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో సీట్లు సాధించేందుకు మత్స్యరాజు ప్రత్యేక శిక్షణ ఇచ్చారని వారు కొనియాడారు. ఈ సందర్భంగా మాస్టార్ సేవలను విద్యాకమిటీ సభ్యులు అభినందించారు. పాఠశాలకు ఒక సీలింగ్ ఫ్యాన్, టేబుల్, 2కుర్చీలు మత్స్యరాజు వితరణగా అందజేశారు. అలాగే విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్‌ను పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి పంపిణీ చేశారు.

కార్యదర్శికి ఘన సన్మానం

గంగవరం : మోహనాపురం గ్రామ సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్‌ను జడేరు, మోహనాపురం గ్రామ సచివాలయాల ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గ్రేడ్–3 కార్యదర్శిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా మోహనాపురం గ్రామ సచివాలయంలో కార్యదర్శి చంద్రశేఖర్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. రాజాభూషణ్, వీర్రాజు, భవానీరెడ్డి, స్వామి, స్వాతి తదితరులు కార్యదర్శికి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



జీకే వీధిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



డుంబ్రిగుడలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డుంబ్రిగుడ: మండలంలోని పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలోమంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీ వి.వెంకటరావు, ఎం.గీతా అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు విధిగా తగిన పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక సచివాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, సీడీపీవో దేవమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు తదితరులు హాజరై ఆరోగ్య భద్రతపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. సీడీపీవో దేవమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సూపర్‌వైజర్ అరుణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శించిన చిరుధాన్యాలు



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న సీడీపీవో దేవమణి

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివారు పొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురై మంగళవారం అప్పారావు అనే రైతుకు చెందిన చూలు గేదె అక్కడికక్కడే మరణించింది. విద్యుత్‌లైన్ తీగలు కింద వేలాడుతు ఉండడం వల్ల గేదె విద్యుత్‌షాక్‌కు గురైనట్టు స్థానికులు తెలిపారు. గేదె షాకుకు గురైన వెంటనే కడుపులోని దూడ కూడా బయటకు వచ్చి మరణించిందని చెప్పారు. గేదె షాక్‌కు గురై మృతి చెందడంతో తీవ్రంగా బాధిత రైతు నష్టపోయాడని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బాధిత రైతు అప్పారావుకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మండు వేసవిలో మంచు



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: వేసవి కాలంలోను పొగమంచు దట్టంగా కురుస్తోంది.మంగళవారం ఉదయం 8గంటల వరకు పాడేరు ప్రాంతంలో పొగమంచు కురవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వాహన చోదకులు లైట్లు వేసుకునే వాహనాలు నడిపారు.